తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

D NEWS

Published From: Medchal-Malkajgiri సంపుటి: 5 సంచిక: 84 పేజీలు : 08 ఆదివారం 15-3- 2026 వెల: 3 రూ/.

## ఆ మూడు పోర్టుల నుంచి దూరంగా వెళ్లిపొండి.

**- యూఏఈ ప్రజలకు ఇరాన్ హెచ్చరిక**



**టెహ్రాన్** మధ్యప్రాచ్యంలో అమెరికా-ఇజ్రాయెల్‌తో యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ఇరాన్ సంచలన హెచ్చరికలు జారీ చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని మూడు కీలక ఓడరేవులను తమ చట్టబద్ధ లక్ష్యాలు (లెజిటిమేట్ టార్గెట్స్)గా ప్రకటించింది. ఆ ప్రాంతాల్లోని ప్రజలు తక్షణమే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. రాబోయే గంటల్లో ఈ పోర్టులపై దాడులు జరగవచ్చని సంకేతాలిచ్చింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. దుబాయ్‌లోని జెబెల్ అలీ, అబుదాబిలోని ఖలీఫా, ఫుజైరా పోర్టులే తమ లక్ష్యాలని పేర్కొంది. ఈ ఓడరేవుల్లో పౌర ఆవాసాల మాటున అమెరికా సైనిక దళాలు దాగి ఉన్నాయని, కాబట్టి వాటిపై దాడి చేయడం తమకు

2లో..

## కల్తీ నిర్వాహకులను పట్టుకోవడంలో
# ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది

**- తెలంగాణలో పెరుగుతున్న కల్తీ ఫుడ్ అంటూ కవిత ట్వీట్**



**హైదరాబాద్** తెలంగాణలో విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఇటీవల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు, కల్తీ పెరుగు గుట్టు రట్టు అయిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గడచిన మూడేళ్లలో 14,312 ఫుడ్ శాంపిల్స్ ను టెస్టింగ్ చేయగా కేవలం 16 లైసెన్సులు మాత్రమే రద్దు చేసినట్లు సమాచారం. అలాగే జీరో

2లో..

## లేని గ్యాస్ కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారు

**- బీజేపీ చీఫ్ రాంచందర్ రావు**



**హైదరాబాద్** గ్యాస్ కొరత, మూసీ ప్రాజెక్టు అంశాలపై ప్రభుత్వ తీరును తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఎండగట్టారు. దేశంలో అసలు గ్యాస్ కొరత అనేదే లేదని స్పష్టం చేసిన ఆయన, కొంతమంది కావాలనే లేని కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితుల వల్ల అనేక దేశాల్లో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలోని


2లో..

## జిల్లాకు రింగ్ రోడ్డు..
# హైదరాబాద్‌కి లింక్

## తెలంగాణలో రవాణా గేమ్ చేజర్ కాబోతుందా.?

**హైదరాబాద్** కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక జాతీయ రహదారులు, రైలు మార్గాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోంది. ఒక్క తెలంగాణలోనే 2 వేల కిలోమీటర్లకుపైగా రహదారుల నిర్మాణం చేపట్టింది. తాజాగా రేవంత్ సర్కార్ కూడా రహదారుల విస్తరణ, కొత్త మార్గాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. అభివృద్ధికి రహదారులు కీలకంగా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రానికి రింగ్ రోడ్లు నిర్మించేందుకు ప్రణాళిక రచిస్తోంది. ఇది రాష్ట్రవ్యాప్త రవాణా వ్యవస్థను ఆధునికీకరించి, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది.

2లో..






# భారత వ్యతిరేకి కాంగ్రెస్

**- మోదీ తీవ్ర ఆగ్రహం**

**డిస్పూర్** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు.మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం

2లో..

## కొండగట్టుకు బండి సంజయ్
# 'అంజన్న ఆశీర్వాద యాత్ర'

**- డ్రోన్ తగలడంతో తేనెటీగల దాడి**



**హైదరాబాద్** అంజన్న ఆశీర్వాద యాత్ర పేరుతో కరీంనగర్ నగరంలోని మహాశక్తి ఆలయం నుంచి బీజేపీ నేత, కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కొండగట్టు అంజన్న ఆలయం వరకు మహా పాదయాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ యాత్రలో భాగంగా కేంద్రమంత్రితో పాటు ఇటీవల జరిగిన కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కార్పొరేటర్లు కూడా ఆయన వెంట పాదయాత్రలో పాల్గొన్నారు. బీజేపీ పార్టీ కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకుంటే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టుకు పాదయాత్రకు వస్తానని బండి సంజయ్ మొక్కుకున్నారు. ఇక ఈ మొక్కుకు సంబంధించిన విషయాన్ని

2లో..

## గ్యాస్ కొరత వేళ భారత్‌కు బిగ్ రిలీఫ్

**- హర్మూజ్ జలసంధిని దాటిన ఎల్పీజీ నౌకలు**




**న్యూఢిల్లీ** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల వేళ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా కలిసి చేస్తున్న దాడులను తిప్పికొట్టేందుకు ఇరాన్ గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతుండటంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాపై భారీ ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే భారత్‌లోనూ గ్యాస్ కొరత వేధిస్తోంది. ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హరర్మీజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఈ

2లో..

## బీఆర్ఎస్‌లో చేరే యోచనలో
# జీవన్ రెడ్డి.?

**ఫిరాయింపు ఎమ్మెల్యేతో పొసగకపోవడం వల్లే!**



**హైదరాబాద్** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ మారే అవకాశం కనిపిస్తోంది. జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో జీవన్ రెడ్డికి, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మధ్య ఎప్పటి నుంచో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం ఉంది. గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ బీఆర్ఎస్ నుంచి గెలవగా, జీవన్ రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే, అనూహ్యంగా సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం, పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డికి మింగుడుపడటం లేదు. తనను సంప్రదించకుండానే బద్ధ శత్రువును పార్టీలోకి తీసుకోవడం తనను అవమానించడమేనని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పార్టీపై ఆయన చాలా కాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.ఇటీవల ఆయన తాను పార్ట మారే ఆలోచనలో ఉన్నానని చెబుతున్నారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల

2లో..

## హోర్ముజ్ జలసంధిని అమెరికా తెరుస్తుంది

**- చైనా సహా ఆ దేశాలు యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్**



# ప్రీ-లాంచ్ మోసం

**- భారతి బిల్డర్స్‌పై రెరా కొరడా - డబ్బు వాపసు చేయాలని ఆదేశం**

**హైదరాబాద్** నిబంధనలను ఉల్లంఘించి ప్రీ-లాంచ్ స్కీమ్ పేరుతో కొనుగోలుదారుల నుంచి డబ్బులు వసూలు చేసిన భారతి బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) కఠిన చర్యలు తీసుకుంది. ఆ సంస్థకు మొత్తం రూ. 4.74 కోట్ల భారీ జరిమానా విధించడంతో పాటు, దానిని 'డిఫాల్టర్ ప్రమోటర్'గా ప్రకటించింది. బాధితులకు 60 రోజుల్లో వడ్డీతో సహా పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్' ప్రాజెక్టుకు

2లో..

TG RERA
TELANGANA REAL ESTATE REGULATORY AUTHORITY

## సీఎం వ్యవహారం
# చాలా వింతగా ఉంది

**- మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**



**హైదరాబాద్** ఖజానాలో డబ్బులు లేవంటూనే, వేలకోట్ల రూపాయలతో మూసీ ప్రాజెక్టును చేపడతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి వ్యవహారం చాలా వింతగా ఉందని అన్నారు. తినడానికి మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా ఆయన తీరు ఉందని ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్లు

2లో..

అక్షరగళం
తెలుగు దినపత్రిక https://aksharagalam.com
ప్రతి అక్షరం ప్రజల కోసం



# కల్తీ నిర్వాహకులను పట్టుకోవడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది

క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇదే విషయంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ట్వీట్ చేశారు. కల్తీ నిర్వాహకులను పట్టుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని అన్నారు. తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. నిందితులను శిక్షించడంలో విఫలం అవుతున్నారని ట్వీట్ చేశారు.ప్రభుత్వ డేటా ప్రకారం ఫుడ్ శాంపిల్ టెస్టులు గణనీయంగా దాదాపు 46 శాతం తగ్గినట్లు తెలిపారు. అలాగే సివిల్ కేసులు కూడా 71 శాతం తగ్గిపోయినట్లు కవిత స్పష్టం చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఒక్కటంటే ఒక్కటి కూడా క్రిమినల్ కేసు నమోదు చేయకపోవడం గమనార్హం అని తెలిపారు. కేవల ఒకే ఒక లైసెన్స్ ను రద్దు చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని ఇతర రాజకీయ పార్టీలు కూడా ఈ విషయంపై పోరాడకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ మేరకు ఇటీవల పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ తీరును రాతపూర్వకంగా తెలియజేసింది. ఈ విషయాలను కవిత తన ట్వీట్ లో ప్రస్తావించారు. ఇక శిక్షలు వేయడంలో, లైసెన్స్ లను రద్దు చేయడంలో తెలంగాణ రాష్ట్రంతో పోలిస్తే కర్నాటక, కేరళ, ఏపీ తదితర రాష్ట్రాలు చాలా ముందున్నట్లు నివేదిక ద్వారా తెలుస్తోంది. ఇక ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే కల్తీకి పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు పడేలా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## లేని గ్యాస్ కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారు

ప్రభుత్వం భారత్‌లో ధరలను నియంత్రణలో ఉంచిందని గుర్తుచేశారు. గతంలో రూ. 1,200 వరకు ఉన్న గ్యాస్ ధరను రూ. 900లకు తగ్గించి సామాన్యుడిపై భారం తగ్గించిన ఘనత కేంద్రానిదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు విషయంలో బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తూ, తాము నది శుద్ధికి వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాంచందర్ రావు హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టు కోసం 50 మీటర్ల బఫర్ జోన్ అవసరమే లేదని, కేవలం ఒక గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం 100 ఎకరాల భూమిని సేకరించాలని చూడటం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. గుజరాత్‌లో సబర్మతి ప్రాజెక్టును ఎవరికీ నష్టం కలగకుండా ఏ విధంగా పూర్తి చేశారో ప్రభుత్వం గమనించాలని సూచించారు.

## ఆ మూడు పోర్టుల నుంచి దూరంగా వెళ్లిపొండి.

చట్టబద్ధమైన హక్కని ఇరాన్ స్పష్టం చేసింది. హార్ముజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.ఇరాన్‌కు చెందిన కీలకమైన ఖార్గ్ ద్వీపంపై అమెరికా దాడులు జరిపిన నేపథ్యంలోనే ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. ఇరాన్ ముడిచమురు ఎగుమతుల్లో 90 శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతాయి. అయితే, తాము సైనిక లక్ష్యాలనే ధ్వంసం చేశామని, చమురు క్షేత్రాలకు నష్టం కలిగించలేదని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్ కామ్) తెలిపింది. ఇరాన్ చర్యలపై యూఏఈ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ అధికారులు కొద్ది వారాల క్రితం తమ దేశంలో పర్యటించినప్పుడు ఇలాంటి దాడులకు పాల్పడతామని ఎలాంటి సూచన ఇవ్వలేదని, ప్రస్తుత హెచ్చరికలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని యూఏఈ విదేశాంగ మంత్రి లానా నుస్సీబెహ్ అన్నారు. తుపాకులు నిశ్శబ్దమయ్యాకే మధ్యవర్తిత్వంపై చర్చలు సాధ్యమని ఆమె స్పష్టం చేశారు.ఇప్పటికే సౌదీ అరేబియా, కతార్, కువైట్‌లలోని పలు ఇంధన కేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది. మరోవైపు, ఫుజైరా చమురు కేంద్రం వద్ద ఓ డ్రోన్‌ను కూల్చివేయగా, దాని శకలాలు పడి మంటలు చెలరేగాయి. దీంతో చమురు లోడింగ్ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ పరిణామాలతో గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోంది.

## జిల్లాకు రింగ్ రోడ్డు.. హైదరాబాద్‌కి లింక్

రాష్ట్రంలోని ప్రతీ ప్రధాన జిల్లా కేంద్రం(హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటివి) చుట్టూ రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు, ఇవి దగ్గర్లోని జాతీయ రహదారులు, హైవేలతో అనుసంధానం కలిగి ఉంటాయి. ఇది హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్, 340--347 కి.మీ. పొడవు, 4--6 లేన్లు)ను సప్లిమెంట్ చేస్తూ, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)కు వెలుపలి ప్రాంతాల్లోకి విస్తరిస్తుంది. మొత్తం 1,940 హెక్టార్ల భూమి అవసరం, భూసేకరణ ఇప్పటికే ప్రారంభమైంది. రింగ్ రోడ్ల నిర్మాణంతో 24 పట్టణాలు, 200 గ్రామాలను అనుసంధానం చేస్తుంది. దీంతో ట్రాఫిక్ 30 నుంచి 40 శాతం తగ్గుతుంది. లాజిస్టిక్స్ ఖర్చు తగ్గుతుంది. ఇండస్ట్రియల్ క్లస్టర్లు, లాజిస్టిక్ పార్కులు, రియల్ ఎస్టేట్, ఐటీ హబ్‌లు ఏర్పాటుకు అవకాశం కలుగుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, 72 హెక్టార్ల అటవీ భూమి రక్షణ, భవిష్యత్తులో ఆరు లేన్ల విస్తరణతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది. భూసేకరణ ఆలస్యాలు, ఖర్చు పెరగడం ప్రధాన సమస్యలు. కానీ ఎన్‌హెచ్‌ఏఐ సహకారంతో 5 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. మూడేళ్లలో పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. ఈ రింగ్ రోడ్లు తెలంగాణను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చి, గేమ్ చేంజర్ అవుతాయి.

## భారత విరోధి కాంగ్రెస్

ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరే యోచనలో జీవన్ రెడ్డి.?

20వ తేదీ తర్వాత ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి, గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జగిత్యాలలోని తన అనుచరులతో, కీలక నేతలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ మార్పుపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ పూర్తి చేశారని, మెజారిటీ అనుచరులు ఆయన నిర్ణయానికి మద్దతు తెలిపారని సమాచారం.జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీ వీడకుండా ఉండేందుకు కాంగ్రెస్ అధిష్టానం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, సంజయ్ కుమార్ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని ఆయన గట్టిగా ప్రశ్నిస్తున్నారు.  దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడితే, ప్రత్యర్థిని తెచ్చి నెత్తిన కూర్చోబెట్టడం ఏమిటి  అని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ పరిణామా కారాణం ఆయన వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదని చెబుతున్నారు.  ఒకవేళ జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే, జగిత్యాల నియోజకవర్గంలో సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. కాంగ్రెస్ కేడర్‌లో చీలక రావడం ఖాయం. అటు బీఆర్ఎస్‌కు ఈ సీనియర్ నేత రాక పెద్ద బలాన్ని ఇస్తుందని ఆ పార్టీ భావిస్తోంది. పార్టీ మారే అంశంపై జీవన్ రెడ్డి నుంచి త్వరలోనే ఒక అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.కాంగ్రెస్ పార్టీతో  తాటిపర్తి జీవన్ రెడ్డికి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా విడదీయలేని అనుబంధం ఉంది. 1980వ దశకంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, జగిత్యాల నియోజకవర్గం నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ఆ ప్రాంతంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు, భవనాల శాఖ వంటి కీలక మంత్రి పదవులను నిర్వహించిన జీవన్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. ఓటమి ఎదురైనప్పుడు కూడా పార్టీని వీడకుండా విధేయుడిగా ఉన్న ఆయన తెలంగాణ ఉద్యమం తర్వాత వెనుకబడిపోయారు. వరుసగా ఓడిపోతూ వస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసినా ఓడిపోయారు.

## హార్ముజ్ జలసంధిని అమెరికా తెరుస్తుంది

న్యూయార్క్  హార్ముజ్ జలసంధిని త్వరలో అమెరికా తెరుస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. హార్ముజ్‌ను ఇరాన్ మూసివేయడంతో ప్రభావితమైన దేశాలు ఇక్కడకు నౌకలను పంపించాలని ఆయన సూచించారు. ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం 15వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆయన చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ లాంటి దేశాలకు కీలక విజ్ఞప్తి చేశారు.

హార్మ్యాజ్ జలసంధి రక్షణ కోసం ఆ దేశాలు నౌకలను పంపించాలని అన్నారు. అమెరికా నావికాదళం త్వరలో హార్ముజ్ జలసంధి నుంచి ప్రయాణించే నౌకలకు రక్షణ కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ట్రూత్ ప్లాట్‌ఫామ్ వేదికగా స్పందించారు. హార్ముజ్ జలసంధిని మూసివేసిన నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని దేశాలు, ముఖ్యంగా ప్రభావితమైన దేశాలు అమెరికాతో కలిసి యుద్ధ నౌకలను పంపించాలని కోరారు. ఈ జలసంధిని మూసివేయడం వల్ల ప్రభావితమైన దేశాలు తమతో కలుస్తున్నాయని తెలిపారు. ఇరాన్ సైనిక స్థావరాలను 100 శాతం నాశనం చేశామని ట్రంప్ పేర్కొన్నారు. తల తెగిన ఇరాన్ లాంటి దేశంతో ముప్పు ఉండదని స్పష్టమవుతోందని అన్నారు. ఇరాన్ తీర ప్రాంతంపై అమెరికా దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. త్వరలో హార్ముజ్‌ను తెరుస్తామని, ఈ దారిని స్వేచ్ఛగా, సురక్షితంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. చైనా వంటి దేశాలు నౌకలను పంపిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్యాస్ కొరత వేళ భారత్‌కు బిగ్ రిలీఫ్

పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒక చల్లటి వార్త చెప్పింది. భారత్‌కు ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు షిప్‌లు హరరీ?్మజ్ జలసంధిని సురక్షితంగా దాటి బయటికి వచ్చినట్లు తెలిపింది.ఇక పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో హర్మ్యాజ్ జలసంధికి రెండు వైపులా వందల కొద్దీ నౌకలు చిక్కుకుపోయాయి. అయితే భారత జెండాలు ఉన్న నౌకలను హర్మ్యాజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతి ఇస్తామని ఇప్పటికే ఇరాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు శనివారం సురక్షితంగా హర్మ్యాజ్ జలసంధిని దాటినట్లు కేంద్ర భారత ప్రభుత్వం వెల్లడించింది. శివాలిక్, నందాదేవి పేరు ఉన్న గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నట్లు కేంద్రం షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా స్పష్టం చేశారు.ఈ శివాలిక్, నందాదేవి నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ రెండు నౌకలు.. ఈనెల 16వ తేదీ లేదా 17వ తేదీన భారత్ తీరానికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గత కొన్ని రోజులుగా దేశంలో ఎల్పీజీ సరఫరాపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతోన్న వేళ.. ఈ రెండు షిప్‌లు త్వరలోనే భారత్‌కు చేరుకోనుండటం భారీ ఊరటను కలిగించే అంశంగా మారింది.మరోవైపు డొమెస్టిక్ గ్యాస్ సరఫరాలో ఎలాంటి అడ్డంకులు లేవని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. గృహాలకు వినియోగించే సిలిండర్ల విషయంలో ప్రజలెవరూ ఆందోళన పడొద్దని తేల్చి చెప్పింది. గ్యాస్ కొరత ఊహాగానాలతో అవసరం లేకపోయినా చాలామంది వినియోగదారులు ముందస్తుగా బుకింగ్ చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల బ్లాక్‌మార్కెట్‌ను అడ్డుకోవాలని అన్ని రాష్ట్రాలకు సూచించినట్లు తెలిపింది. అదే సమయంలో ఆకస్మిక తనిఖీలు కూడా చేస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే దేశంలో గ్యాస్, ఎల్పీజీ సరఫరా, నిల్వలపై పెరుగుతున్న ఆందోళనల వేళ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను పెట్రోలియం శాఖ అధికారులు మీడియాకు వెల్లడించారు. ప్రాధాన్యత క్రమంలో వాణిజ్య సిలిండర్లను సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, బిహార్ రాష్ట్రాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేస్తున్న వారిపై దాడులు చేస్తున్నామని వివరించారు. ఎల్పీజీ సరఫరాలో ఇళ్లు, హాస్పిటల్స్, హాస్టళ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సిలిండర్‌లు బుకింగ్ కావడం లేదని చాలా మంది ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్న పెట్రోలియం శాఖ అధికారులు గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస బుకింగ్ గడువు ఉందని గుర్తు చేశారు.

## కొండగట్టుకు బండి సంజయ్ 'అంజన్న ఆశీర్వాద యాత్ర'

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తేల్చి చెప్పారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు 10 వేల మంది కార్యకర్తలు కూడా బండి సంజయ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.అయితే బండి సంజయ్ చేపట్టిన అంజన్న ఆశీర్వాద యాత్ర పాదయాత్రలో బీజేపీ కార్యకర్తలు, అభిమానాలు, ప్రజలు భారీ ఎత్తున హాజరై ఆయన వెంట నడిచారు. ఈ యాత్ర రామడుగు మండలం కోన్‌రావు పేట వద్దకు రాగానే ఊహించని సంఘటన చోటు చేసుకుంది. పాదయాత్ర కోన్‌రావు పేట సమీపంలోకి రాగానే ఆ వీడియోలను తీసేందుకు బీజేపీ కార్యకర్తలు డ్రోన్‌ను ఎగురవేశారు. అయితే ఆ డ్రోన్ నేరుగా వెళ్లి రోడ్డు పక్కనే చెట్టుకు ఉన్న తేనెతుట్టెను తాకడంతో ఒక్కసారిగా తేనెటీగలు వాడిపై దాడి చేశాయి. దీంతో అక్కడ ఒక్కసారిగా తీవ్ర గందరగోళం తలెత్తింది. తేనెటీగలు కొందరు బీజేపీ కార్యకర్తలపై దాడి చేయడంతో వారికి గాయాలు అయ్యాయి. వెంటనే అలర్ట్ అయిన కేంద్రమంత్రి బండి సంజయ్ గాయపడిన కార్యకర్తలకు ట్రీట్‌మెంట్ ఇప్పించారు. దీంతో అక్కడి గందరగోళం సద్దుమణిగింది. దీంతో ఆ తర్వాత బండి సంజయ్ మళ్లీ పాదయాత్ర కొనసాగించారు. చివరికి అంజన్న ఆశీర్వాద యాత్ర ఎట్టకేలకు కొండగట్టుకు చేరుకుంది. కేంద్రమంత్రి బండి సంజయ్ సహా బీజేపీ కార్యకర్తలంతా కొండగట్టు అంజన్నను దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు.

## సీఎం వ్యవహారం చాలా వింతగా ఉంది

దండుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని ఒకవైపు చెబుతూనే, మరొకవైపు మూసీ ప్రాజెక్టును చేపడతానని చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీ సుందరీకరణ చేపట్టారని వెల్లడించారు. అసలు మూసీ మురికి కూపంగా మారింది కాంగ్రెస్ హయాంలోనే అని ముఖ్యమంత్రి గుర్తించాలని అన్నారు. మూసీ పునరుజ్జీవంపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ముఖ్యమంత్రి మాట్లాడిన సమయంలో, మూసీ బాధితులకు ఉపశమనం ఇచ్చే ప్రకటన ఏదైనా చేస్తారా అని చూశామని, కానీ ఆ ప్రస్తావనే లేదని విమర్శించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని ముఖ్యమంత్రి చెబుతున్నారని, రైతుబంధు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఇచ్చేందుకు డబ్బులు లేవని చెప్పారని, కానీ ఇప్పుడు మూసీ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతానని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. 2 వేల కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టు ఖర్చు రూ.42,500 కోట్లు అని, గుజరాత్ సబర్మతికి అయిన ఖర్చు రూ.7 వేల కోట్లు అని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. అందాల పోటీలు నిర్వహించడానికి రూ.200 కోట్లు ఖర్చు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, హామీల అమలుకు మాత్రం డబ్బులు లేవంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఒక్క ఇంటినైనా నిర్మించిందా అని ప్రశ్నించారు.

## ప్రీ-లాంచ్ మోసం

సంబంధించి పలువురు కొనుగోలుదారులు రెరాకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అథారిటీ, బిల్డర్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. 2021లో ప్రీ-లాంచ్ ఆఫర్ల ద్వారా కొనుగోలుదారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన భారతి బిల్డర్స్, 24 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, రెరా రిజిస్ట్రేషన్ గానీ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు గానీ లేకుండానే నిధులు సేకరించి, ఇంతవరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై రెరా ఆగ్రహం వ్యక్తం చేసింది.ప్రాజెక్టు పూర్తయ్యే సూచనలు కనిపించకపోవడంతో, కొనుగోలుదారులు అందులో కొనసాగాల్సిన అవసరం లేదని అథారిటీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, బాధితులు చెల్లించిన పూర్తి మొత్తాన్ని వడ్డీతో కలిపి 60 రోజుల్లోగా వాపసు చేయాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్టులో భాగస్వామి అయిన 'శ్రీ భారతి' అనే మరో సంస్థను కూడా ప్రమోటర్‌గా పరిగణిస్తూ, రెండు సంస్థలూ ఉమ్మడిగా ఈ బాధ్యత వహించాలని తీర్పునిచ్చింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను భారతి బిల్డర్స్‌పై కొత్తగా రూ. 3.55 కోట్లు జరిమానా విధించింది. గతంలో ఇదే తరహా ఉల్లంఘనలకు విధించిన రూ. 1.18 కోట్ల జరిమానాకు ఇది అదనమని రెరా పేర్కొంది.ఈ సందర్భంగా రెరా ప్రజలకు కీలక సూచనలు చేసింది. రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులలో 'ప్రీ-లాంచ్' ఆఫర్లు చట్టవిరుద్ధమని, అలాంటి పథకాలలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించింది. రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులపై రెరా పర్యవేక్షణ ఉండదని, ఎస్క్రో ఖాతా వంటి ఆర్థిక భద్రతలు కొనుగోలుదారులకు లభించవని స్పష్టం చేసింది. ఏదైనా ప్రాజెక్టులో ఫ్లాట్ కొనుగోలు చేసే ముందు, దాని రెరా రిజిస్ట్రేషన్ వివరాలను అధికారిక వెబ్‌సైట్ లో ధ్రువీకరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## పాపవినాశనం దగ్గర పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

**తిరుమల** తిరుమలలోని పాపవినాశనం దుకాణాల వద్ద అధికారులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తిరుమల పోలీసులు, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టిన ఈ తనిఖీల్లో నకిలీ పులిగోర్లు బయటపడడం కలకలం రేపింది.తిరుమల పాపవినాశనం ప్రాంతంలోని దుకాణాల్లో తిరుమల పోలీసులు, అటవీశాఖ అధికారులు కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వేర్వేరు దుకాణాల్లో నకిలీ పులిగోర్లు విక్రయానికి ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు సంబంధిత దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన దుకాణాలపై కేసులు నమోదు చేసి, దుకాణాలను సీజ్ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. తిరుమలలో వన్యప్రాణులకు సంబంధించిన వస్తువుల అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ట్రాక్టర్ బోల్తా డ్రైవర్‌కు గాయాలు

**మర్రిపాడు** మర్రిపాడు మండలం చిన్నమాచనూరు పంచాయతీ పరిధిలో ట్రాక్టర్ ప్రమాదం జరిగింది.  నెర్దనంపాడు గ్రామ ఎస్సీ కాలనీ సమీపంలో ఘటన జరిగింది.  ఇనుప సువ్వలు లోడ్తో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది.  ఓవర్లోడ్ కారణంగా ప్రమాదం జరిగినట్లు  స్థానికులు తెలిపారు.  ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్కు స్వల్ప గాయాలు అయ్యాయి.  గాయపడిన డ్రైవర్ను చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు.

## దివంగత పాదిల విజయలక్ష్మీకి ఘన నివాళులు

**- ఎంపీ వద్దిరాజు**



**ఖమ్మం** నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాదిల రవికుమార్ మాతృమూర్తి విజయలక్ష్మి శుక్రవారం దివంగతులయ్యారు.బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు పారా నాగేశ్వరరావు,కాపు జేఏసీ ఛైర్మన్ చందు జనార్ధన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తోట రామారావు తదితర ప్రముఖులు శనివారం ఉదయం వారి స్వగ్రామం ముదిగొండ మండలం ఖానాపురంలో ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు.స్వర్గీయ విజయలక్ష్మీ అంతిమయాత్రలో పార్థివదేహాన్ని ఉంచిన పాడేను రవిచంద్ర, గాంధీ, నాగేశ్వరరావు తదితర ప్రముఖులు మోసి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.దివంగత విజయలక్ష్మీ భర్త దేవేందర్, కుమారుడు రవికుమార్,కుమార్తె శైలజ, వారి కుటుంబ సభ్యులను రవిచంద్ర, గాంధీ, నాగేశ్వరరావు,జనార్ధన్, రామారావు, పోలీస్ అధికారులు రామోజీ రమేష్,సాధుల సారంగపాణి, ఎక్సైజ్ శాఖ అధికారి శ్యామ్, బీఆర్ఎస్ నాయకుడు బచ్చు విజయ్ కుమార్ తదితరులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పేర్ని నాని ఇంటి దగ్గర ఉద్రిక్తత

**మచిలీపట్నం** జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కోసం పేర్ని నాని ఇంటి వద్ద ఆంక్షలు విధించడం వివాదానికి దారి తీసింది. పేర్ని నాని ఇంటికి ఎవరినీ రాకుండా పోలీసుల మోహరించారు. ఇంట్లో పనివారిని కూడా రాకుండా అడ్డుకున్నారు. పేర్ని నాని ఇంటి వద్దే కృష్ణాజిల్లా వైసీపీ కార్యాలయం వుంది. పార్టీ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని కూడా వెళ్లనివ్వలేదు. పేర్ని నాని ఇంటికి వెళ్లే మార్గాన్ని బారికేడ్లతో మూసేసారు. వైసీపీ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ ను పోలీసులు తోసేసారు. పోలీసుల తీరుపై పేర్ని నాని మండిపడ్డారు. సెక్షన్ 30 అమలులో ఉందంటూ సమాధానం పోలీసులు ఇచ్చారు. జనసేన కార్యక్రమానికి వర్తించని సెక్షన్ 30.. తమకు ఎలా వర్తిస్తుందని పోలీసులను  పేర్ని నాని  నిలదీసారు. సెక్షన్ 30 ఆర్డర్ చూపించమని ప్రశ్నించారు.

## చేనేత వృత్తిని కాపాడుకోవాలి

**- మంత్రి తుమ్మల**

**హైదరాబాద్** దేశ సంస్కృతి-కళావైభవాన్ని చాటి చెప్పే చేనేత వృత్తిని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.  అమీర్పేట కమ్మ సంఘంలో ప్రత్యేక చేనేత మార్కెటింగ్ ఈవెంట్-2026 పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం నేతన్నల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను తప్పక ధరించాలని కోరారు. చేనేతకారుల ఉత్పత్తులను నేరుగా వినియోగదా రునలు అందించి వారికి ప్రోత్సాహం అందించడానికి ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని చేనేత అభివృద్ధి కమిషనర్ డాక్టర్ అరుణ్కుమార్ తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన నిష్ణా తులైన చేనేతకారుల సిల్క్, కాటన్ వస్త్రాలు ఎక్స్పోలో ప్రజలకు అందుబాటులో ఉంచారన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు.

## పూర్వ విద్యార్థులకోసం ఒక యాప్

ప్రముఖ విద్యాసంస్థల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులను ఒకే చోటకు చేర్చే హైదరాబాద్ అంకురం వావ్, వృద్ధి ప్రణాళికల్లో భాగంగా హూస్టార్ గా  మారింది. ఆయా విద్యా సంస్థల్లోని ప్రస్తుత విద్యార్థులకు.. ఇప్పటికే ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఉన్నవారు మార్గదర్శకంగా నిలిచేందుకు ఈ వేదిక తోడ్పడుతుందని సంస్థ పేర్కొంది. ఈ పూర్వవిద్యార్థుల వేదికను క్రియాశీలకం చేసేందుకు హూక్టర్ కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతను ఉపయోగిస్తుందని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పరేశ్ మసాదే తెలిపారు. ప్రస్తుతం 1,200 విద్యాసంస్థలతో భాగస్వామ్యం ం కుదుర్చుకున్నామని, 18 నెలల్లో ఈ సంఖ్యను 2,500కు పెంచాలనే లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో 10,000 మంది విద్యార్థులకు ఇంటర్న్షిప్లు, రూ.100 కోట్ల ఉపకార వేతనాల నిధిని సమకూర్చబోతున్నట్లు తెలిపారు. దాదాపు 28 దేశాల్లోని 49 లక్షల మంది తమ నెట్వర్క్ భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు.

## కుటుంబ కలహాల నేపధ్యం

**- పిల్లలతో సహ తల్లి ఆత్మహత్యాయత్నం**

**- బతికిపోయిన  కుమార్తె**





**హైదరాబాద్** బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దమ్మ నగర్ లో కుటుంబ కలహాలతో సత్యవేణి  అనే గృహిణి  తన ఐదేళ్ల కుమారుడు రుద్రాన్ష్,రెండేళ్ల కుమార్తె తన్విక గొంతు నులిమి,తాను ఉరేసుకొని మృతి చెందింది.

కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా కుమార్తె పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించారు.మ్యారేజ్ డే సందర్భంగా సరదాగా బైటకి వెళ్దాం అన్ని భార్య అడగడం తో భర్త వొద్దు అన్నాడంతో అవేదన కు గురై ఇద్దరి మధ్య గొడవ జవరిగింది.  తన ఇద్దరు పిల్లలకు చంపి తాను  ఉరి వేసుకొంది.  ఇంట్లో వాళ్ళు ఎవ్వరు బైటకి రావడం లేదు అన్ని గమనించిన ఇంటి పక్కన వాళ్ళు,  తలుపు ఎంత కొట్టిన తీయకపోడంతో కిట్ కి లోంచి చూసి పోలీసులకు ఫోన్ చేసారు.

## శ్రీవారిని దర్శించుకున్న వైకాపా నేతలు

**తిరుమల** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని శనివారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ విరామ సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.మాజీ దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.అదేవిధంగా మాజీ మంత్రి విడదల రజిని కూడా శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి సైతం స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.దర్శనం అనంతరం ఆలయం వెలుపల వీరు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

# స్వామి వారి కృపా కటాక్షాలతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలి

**- పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**



**అక్షర గళం, శేరిలింగంపల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగూడ లో సీనియర్ నాయకులు జోగిపేట్ భాస్కర్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం లో బ్రహ్మ శ్రీ వేదమూర్తులైన శ్రీ అరుణ్ గురుస్వామి వారి చేతుల మీదుగా శ్రీ పద్మావతీ అలివేలుమంగా సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ద్వజస్తంభ, శిఖర, రాజగోపుర, నరసింహస్వామి యంత్ర విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ఆయన సతీమణి శ్యామల దేవి, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శ్రీ పద్మావతీ అలివేలుమంగా సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ద్వజస్తంభ, శిఖర, రాజగోపుర, నరసింహస్వామి యంత్ర విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం అత్యంత వైభవంగా కన్నుల పండుగ గా జరిగిందన్నారు. వెంకటేశ్వర స్వామి వారి కృపా కటాక్షాలతో ప్రజలందరు సుఖ సంతోషాలతోఉండాలని, స్వామి వారి కృపా ప్రజలందరి పై ఉంటుంది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్య వైశ్యులు రాజకీయంగా ఎదగాలి

**- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద్**



**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** ఆర్య వైశ్యులు రాజకీయంగా ఎదగాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ అన్నారు. మేడ్చల్ జిల్లా శ్రీ వాసవి ఆర్య వైశ్య సంఘం సుచిత్ర , కొంపల్లి ఆవిష్కరణ , నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణా స్వీకరాం హంస్ & టాన్స్ కన్వెన్షన్, కొంపల్లి నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా ఆయనతో పాటు , ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద, ,వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత ,ఉప్పల శ్రీనివాస్ గుప్త,చీకోటి ప్రవీణ్ గుప్త లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సంఘ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆర్య వైశ్యులు రాజకీయంగా ఎదగాలని అన్నారు. అనంతరం తెలుగు నూతన సంవత్సర పంచాంగాన్ని అతిథులు ఆవిష్కరించారు. అధ్యక్షుడు చిట్టిమల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తోట బిక్షపతి, కోశాధికారి వెంకటేశం, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు చీల రాము, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త చేతుల మీదుగా జరిగింది ఈ కార్యక్రమంలో సీఎం ఓ ఎస్ డి వేముల శ్రీనివాస్, అయిత రాములు, మీడియా సెల్ కన్వీనర్ సుదీర్ మంకాల, లింగా కృష్ణమూర్తి, ఈశ్వర్, నాగరాజు, సురేష్ బాబు,వంశీ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## దక్షిణ భారత కన్వీనర్‌గా

# యర్రం శ్రీరాంరెడ్డి నియామకం

అక్షరగళం, శేరిలింగంపల్లి : భారతదేశంలో ప్రముఖ ప్రజాస్వామ్య రైతు సంస్థగా పేరొందిన భారతీయ కిసాన్ సంగతన్ (బీకేఎస్) దక్షిణ భారత కన్వీనర్‌గా యర్రం శ్రీరాం రెడ్డి నియమితులయ్యారు. రైతుల సమగ్ర అభివృద్ధి, స్వావలంబన, ప్రభుత్వ పథకాల అమలు బలోపేతం దిశగా ఈ నియామకం కీలకంగా భావిస్తున్నారు. దక్షిణ భారత రాష్ట్రాలలో వ్యవసాయ నూతన సాంకేతికత, రైతు సంక్షేమం, ప్రభుత్వ పథకాల లబ్ధి రైతులకు చేరేలా సమన్వయం చేయడం తన ప్రధాన లక్ష్యమని శ్రీరాం రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంట బీమా పథకాలు సమర్థంగా అమలు చేయడం, అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు (ఏంఎస్ పి) హామీ ఇవ్వడం, సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయడం, అప్పుల బారిన పడిన రైతులకు ఉపశమనం కల్పించడం వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు దేశానికి వెన్నెముక మాత్రమే కాక జీవనాడి అని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కమ్ జాతీయ కన్వీనర్ యర్రం వెంకటరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీఎం కిసాన్ సమాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల చివరి రైతు వరకు చేరేలా కృషి చేస్తానని తెలిపారు.



# ఆస్తి పన్నును సకాలంలో చెల్లించాలి

**- గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్**

**అక్షర గళం,కుత్బుల్లాపూర్ :** ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి సర్కిల్ అభివృద్ధికి పాటుపడాలని గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ తెలిపారు. శనివారం గాజులరామారం సర్కిల్ పరిధిలో రాజీవ్ గాంధీ నగర్ లో ఆస్తి పన్ను కట్టని భవనాలను జప్తు చేశారు. ఈ కార్యక్రమంలో టాక్స్ ఇన్స్పెక్టర్లు , బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు. సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను కట్టని భవనాలు యజమానులు తక్షణమే ఆస్తి పన్ను చెల్లించాలని తెలిపారు.






తెలుగు దినపత్రిక
https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

# తెలంగాణ రౌండప్

ఆదివారం - 15 మార్చి 2026 - పేజీలు

## సమాజ సరిహద్దుల వరకు తరమి కొట్టడం కొరకై తపించిన

# మహోన్నత వ్యక్తి కార్ల్ మార్క్స్

**-సిపిఐ మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఇ. ఉమా మహేష్**

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** సమాజ సరిహద్దుల వరకు తరమి కొట్టడం కొరకై తపించిన మహోన్నత వ్యక్తి కార్ల్ మార్క్స్ అని సిపిఐ మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఇ. ఉమా మహేష్ అన్నారు. కార్ల్ మార్క్స్ 143వ వర్ధంతి నిజాంపేట్ సిపిఐ కార్యాలయం వద్ద సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఇ. ఉమా మహేష్, ఏఐటీయూసీ మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వి. శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ తత్వవేత, ఆర్థిక వేత్త, రాజనీతిజ్ఞుడు, మహోన్నత వ్యక్తి మార్క్స్ అని కొనియాడారు. అంతరాలు లేని సమా సమాజం నిర్మాణం కోసం శ్రమ దోపిడీని వెతిరేకించి, అని అన్నారు. కమ్యూనిస్టు మేనిఫెస్టో రూపొందించి ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని నినాదం ఇచ్చిన మహా మనిషి కామ్రేడ్ కారల్ మార్క్స్ అని ఈ ప్రపంచం నుండి భౌతికంగా మనకు దూరమైన రోజుది వారు మనకుఏ భౌతికంగా దూరమైన వారు రేకెత్తించిన సిద్ధాంతం ఆయన రాసిన తత్వశాస్త్రం మనందరినీ ఎప్పుడు తట్టి లేపుతూనే ఉంటుంది అని అలాంటి మహా మనిషి కామ్రేడ్ కారల్ మార్క్స్ కు జోహార్లు మార్క్సిజం వర్ధిల్లాలి కమ్యూనిజం వర్ధిల్లాలి సోషలిజం వర్ధిల్లాలి అని అయన ఆశయా సాధనకు ప్రతి ఒక్కరు పాటు పడాలి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల సాధన నాయకులు మేకల నాగేష్, సిపిఐ నిజాంపేట్ డివిజన్



కార్యదర్శి పొన్నకంటి దస్తగిరి, పి. కవిత, కెవిపిఎస్ నాయకులు ఎన్. బాలుపేరు, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 18న పశువుల సంత వేలం



కల్వకుర్తి మార్చి 14 (అక్షర గళం) ఈనెల 18న కల్వకుర్తి పశువుల సంత వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ మహమూద్ తెలిపారు. పశువుల సంతతో పాటు తై బజార్, వదశాల, పట్టణంలోని చికెన్, మటన్, చేపల వ్యర్థాల వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు డిపాజిట్ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పశువుల సంతకు రూ. 10 లక్షలు, తై బజార్కు రెండు లక్షలు, వధశాలకు రూ. 20,000 డిపాజిట్ చెల్లించాలని కోరారు.

## ఒక్కడి కోసం పరీక్ష కేంద్రం.. కానీ ఆ విద్యార్థి రాలేదు!

కల్వకుర్తి మార్చ్ 14 (అక్షర గళం) నాగర్ కర్నూల్ జిల్లాలో విచిత్ర ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ బ్రిడ్జ్ కోర్సు పరీక్ష రాస్తున్న ఏకైక విద్యార్థి కమ్మరి వరుణ్ సందేశ్ కోసం అధికారులు ప్రత్యేక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తీరా పరీక్ష సమయానికి ఆ విద్యార్థిహాజరుకాకపోవడంతో, అతని కోసం విధులు నిర్వహించాల్సిన ఐదుగురు సిబ్బంది గంటల తరబడి ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది.



## 10 వేల రూపాయలు పెళ్లి కానుక

# అందజేసిన సర్పంచ్ గున్నేళ్ల శ్రీనివాస్



వెల్దండ మార్చి 14 (అక్షర గళం) వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామ సర్పంచ్ గున్నేళ్ల శ్రీనివాస్ రాచూర్ గ్రామానికి చెందిన మన్నెమోని రామస్వామి కూతురు సంధ్య పెళ్లికి రూ. 10 వేల రూపాయలు పెళ్లి కానుకను శనివారం సర్పంచ్ శ్రీనివాసులు అందజేశారు గత సర్పంచ్ ఎన్నికల్లో తాను సర్పంచిగా విజయం సాధిస్తే గ్రామంలో ప్రతి ఆడబిడ్డ పెళ్లికి పదివేలు పెళ్ళికానుక అందజేస్తానని ఆమె ఇచ్చారు ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలోని ఆడపిల్లల పెళ్లికి తనవంతుగా చిరు కానుక అందిస్తున్నట్లు సర్పంచ్ శ్రీనివాసులు అన్నారు ఈ కార్యక్రమంలో జంగయ్య శ్రీశైలం జంగయ్య రామకృష్ణ రమేష్ మదర్ ఎల్లయ్య సురేష్ రెడ్డి పాండు మల్లయ్య రవి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా ప్రారంభమైన అవురుపల్లి నల్లవారిపల్లి శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి జాతర

**- పాల్గొన్న టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**



కల్వకుర్తి మార్చి 14 (అక్షర గళం) కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని అవురుపల్లి గ్రామంలో వైభవంగా పోచమ్మ జాతర శనివారం ప్రారంభమయ్యాయి. మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి మాజీ సింగల్ విండో చైర్మన్ వెంకటేశ్వర రావు అవురిపల్లి సర్పంచ్ పోచయ్య మాడ్గుల మాజీ సర్పంచ్ అంబాల జంగయ్య కలకొండ మాజీ సర్పంచ్ గొర్రె పవన్ కుమార్ రెడ్డి నతీ అఖిల్ నల్లచెరువు మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి యాదయ్య పాలకూర రాజు గౌడ్ సింగల్ విండో డైరెక్టర్ రాజ వర్ధన్ రెడ్డి బ్రాహ్మణపల్లి సర్పంచ్ తిరుపతయ్య ఫిరోజ్ నగర్ ఉప సర్పంచ్ వెంకటయ్య మాజీ ఎంపీటీసీ లాలయ్య గౌడ్ అజిలాపూర్ సర్పంచ్ రమేష్ విజయ భాస్కరరావు వంశీ తరుణ్ అశోక్ చెన్నకేశవులు మాడుగుల మండల బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తా బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య



**వెల్దండ మార్చి 14 (అక్షర గళం)** వెల్దండ మండల కేంద్రానికి చెందిన బిట్టి యాదయ్య అనారోగ్యానికి గురై హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య బిట్టి యాదయ్య ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు

బాధితునికి 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం టిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ మాజీ ఎంపీటీసీ లింగం మాజీ ఉప సర్పంచ్ నిరంజన్ వార్డు నెంబర్ శేఖర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మట్ట శీను శేఖర్ గొడుగు శివ గణేష్ సైదుల్ భాస్కర్ శ్రీకాంత్ వారణాసి శేఖర్ శివ తదితరులు పాల్గొన్నారు

## అనర్హులను తొలగించి అర్హులకు

# ఇళ్ల స్థలాలు కేటాయించాలి

అక్షర గళం, ఖమ్మం: అర్హులైన వారిని విస్మరించి అనర్హులకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడం సరైంది కాదని ప్రభుత్వం వెంటనే రీసర్వే చేసి అసలైన వారికి ఇళ్లు ఇంటి స్థలాలు కేటాయించాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా కన్వీనర్ పాలకుర్తి కృష్ణ, జిల్లా మీడియా కన్వీనర్ మంద వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాలమేరకు స్థానిక బికె బజార్ లో గల తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా కార్యాలయం నందు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం వెలుగు మట్ల భూదాన్ భూముల్లో గత అనేక సంవత్సరాలుగా నివాసాలు ఉంటున్న వారి ఇళ్లను కూల్చివేసి నిరాశ్రయులను చేసిన విషయం దేశమంతా తెలుసన్నారు. ఖమ్మం వెలుగు మట్ల భూదాన్ భూమిలో ఇండ్లు కోల్పోయిన వారికి సరైన న్యాయం జరగలేదన్నారు.

అటువంటి వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం వెలుగు మట్ల భూదాన్ భూముల్లో మరళా 75 గజాల ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ గృహ నిర్మాణం చేపట్టడాన్ని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఖమ్మం జిల్లా కమిటీ అభినందిస్తుందని కానీ అక్కడ అసలైన పేదవారికి ఇంటి స్థలం రాలేదని భూదాన్ భూముల్లో నివాసం లేని వారికి ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. మరల ప్రభుత్వం రీసర్వే చేసి అసలైన భూదాన్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల భూదాన్ బాధితుల పక్షాన నిలబడి తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం పోరాడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బట్టు రాజేందర్, ఎదురుగట్ల చిట్టి మల్లు, నర్సింహా, నాగసాయి, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్ ఎంపీ నిధులతో నిధులు

## రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు



**కల్వకుర్తి మార్చ్ 14 (అక్షర గళం)** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి డివిజన్ ఊర్కొండపేట గ్రామంలో ఎంపీ డీకే.అరుణ నిధులతో నూతన సీసీ రోడ్డు పనులకు బీజేపీ నేత ముచ్చర్ల జనార్దన్ రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ప్రజల రవాణా సౌకర్యం కోసం రూ.20 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అబ్దుల్ రషీద్, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాన్ని పరిశీలించిన DMHO

**కల్వకుర్తి మార్చి 14 (అక్షర గళం)** కల్వకుర్తి మండలంలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవికుమార్ పరిశీలించారు. ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. దాదాపు 200 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వివిధ వ్యాధులకు చెందిన ప్రత్యేక వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కల్వకుర్తి RTC బస్టాండ్లో స్త్రీలకు ఉచిత మరుగుదొడ్లు



కల్వకుర్తి మార్చి 14 (అక్షర గళం) కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్లో మహిళలకు ఉచిత మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిని ఉచిత మరుగుదొడ్లను శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తున్న మహిళలు ఉచితంగా మరుగుదొడ్లు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులు తదితరులు ఉన్నారు.

## కల్వకుర్తి అనుమతి లేని ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు



**కల్వకుర్తి మార్చి 14 (అక్షర గళం)** కల్వకుర్తి మండలం రామగిరి దుందుభి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం తెల్లవారుజామున గ్రామస్థులుఅడ్డుకున్నారు.అధికార పార్టీ నేతల అండతోనే ఈ అక్రమ రవాణా సాగుతోందని వారు ఆరోపించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై మైనింగ్ అధికారులు, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లను మా ఊరు నుంచి పోనించేదే లేదని గ్రామస్తులు పేర్కొన్నారు

## చెర్కూర్‌లో నీటి సమస్యలపై సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు ప్రత్యేక దృష్టి





**వెల్దండ మార్చి 14 (అక్షర గళం)** వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు ఎండా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి ప్రజలకు నీటి సమస్యలు పరిష్కరించేందుకు గత కొన్ని రోజులుగా నిరుపయోగంగా ఉన్న సాయిరాం బోరు బావిలో శనివారం నూతన బోరు మోటార్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా బోరు బావి చెడిపోవడంతో కాలనీవాసులు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాగునీటి కోసం మహిళలు, వృద్ధులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారి సమస్య పరిష్కారం కోసమే నూతన బోరు మోటార్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండల్, వార్డు సభ్యులు లాలయ్య, పంచాయతీ కార్యదర్శి హారిణి, గ్రామస్తులు మల్లయ్య, సందీప్, చెన్నయ్య, వెంకటయ్య, సాయి, మహేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలి

**- కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్**

**- రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాల సందర్శన.**



కల్వకుర్తి మార్చి 14 (అక్షర గళం) కుల మతాలకతీతంగా ప్రతిఒక్కరు ప్రశాంత వాతావరణంలో పవిత్ర రంజాన్ పండుగను జరుపుకోవాలని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కోరారు.రంజాన్ పండుగ రోజున ముస్లీం సోదరులకు నమాజ్ చేసుకోవడానికి ఏర్పాటు చేయవలసిన సౌకర్యాల కోసం శనివారం కల్వకుర్తి మున్సిపాలిటీలోని రెండు ఈద్గాలను మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,లు మస్జిద్ కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,లు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గాలలో ముస్లీం సోదరులకు ఇబ్బందులు తలెత్తకుండా రంజాన్ పండుగా నమాజ్ చేయడానికి మున్సిపాలిటీ తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి,నాయకులు మక్బూల్,గణేష్,సోఫీ,చిత్తారి శ్రీనివాసులు,పాండుయాదవ్, గౌస్,మన్సూర్,ఖయ్యూం, మాసం,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు..**

**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.**





**కల్వకుర్తి మార్చి 14 (అక్షరగళం):**హైదరాబాద్‌లోని నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో నిర్వహించిన మెగా జాబ్ ఫెయిర్ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులుడ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ. రాష్ట్ర యువత నైపుణ్యాలను పెంపొందించుకొని ఇటువంటి జాబ్ ఫెయిర్ల ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలను పొందాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులతో పాటు పలువురు నిర్వాహకులు,వివిధ సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## జూలూరి రమేష్ బాబు పెళ్లిరోజు పురస్కరరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కల్వకుర్తి అధ్వర్యంలో బస్టాండ్ లో ప్రయాణీకులకు అన్నదానం కార్యక్రమం..



కల్వకుర్తి మార్చి 14 (అక్షరగళం):కల్వకుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూలూరి రమేష్ బాబు దంపతుల పెళ్లిరోజు పురష్కరించుకొని కల్వకుర్తి లయన్స్ క్లబ్ అధ్వర్యంలో శనివారం బస్టాండ్ లో ప్రయాణికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రెటరీ జూలూరి రమేష్ బాబు హాజ రాయ్ అన్నదానం చేశారు.జూలూరి రమేష్ బాబు మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి ఆకలి తీర్చడం ఎంతో సంతోషమన్నారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేష్ బాబు దంపుతలచే కేక్ కట్ చేయించారు. ప్రతినెల ఇలాంటి సేవా కార్యక్రమాలు లైన్స్ క్లబ్ ద్వారా సంతోషమన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, లైన్స్ క్లబ్ మెంబర్స్ గుబ ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.






# పిఠాపురంలో వర్మకు మళ్లీ కోపమొచ్చింది!

**పిఠాపురం,** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకే మీరు గుర్తింపు ఇవ్వడం లేదంటే, ఇక మమ్మల్ని ఏం గౌరవిస్తారు. కూటమిలో అధికారులే చిచ్చు పెడుతున్నట్లుగా పరిస్థితి ఉందంటూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పిఠాపురం మున్సిపల్ కళ్యాణ మండపంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ సందర్భంగా వర్మ మున్సిపల్ కమిషనర్ కనకరావును ప్రశ్నించారు. కార్యక్రమం ప్రారంభంలో స్టేజిపై ఉన్న ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో రెవెన్యూ స్టాంపు సైజులు చిన్నదిగా ప్రచురించడంపై వర్మ అధికారులను నిలదీశారు. చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి, మాకు ఎలాగూ గౌరవం ఇవ్వరూ కనీసం ముఖ్యమంత్రికైనా గౌరవం ఇవ్వరా అంటూ నిలదీశారు. దీంతో కమిషనర్ కనకారావు వర్మకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వర్మ పట్టించుకోలేదు. నేను ఊరుకున్నా, మా పార్టీ కార్యకర్తలు ఊరుకోరంటూ మండిపడ్డారు మాజీ ఎమ్మెల్యే వర్మ.. ఇది సరికాదు, కూటమిలో చిచ్చుపెట్టేది అధికారులేనంటూ అసహనంతో వర్మ భావోద్వేదానికి లోనయ్యారు. ఎవరినైనా గౌరవించాల్సిందే. ఇది మూడు పార్టీలకు వర్తిస్తుంది. ఇప్పటికే చాలా సార్లు ఇటువంటి అవమానాలు జరిగాయని ఆవేదనను వెళ్లగక్కారు. ఇలా మీ ప్రవర్తన ఉంటే, మమ్మల్ని కార్యక్రమాలకు కూడా పిలవడం అనవసరం, పిలిచి అవమానించకండంటూ అధికారులకు వర్మ సూచించారు. తాను సమావేశంలో ఉండటం సరికాదంటూ లేచి వెళ్లిపోయారు. అధికారుల తీరుపట్ల టిడిపి కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యేగా పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ దాదాపుగా అన్ని కార్యక్రమాలు జనసేన ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. కేవలం టిడిపి అతిథి పాత్రకు మాత్రమే పరిమితమైంది. బీజేపీ కూడా టిడిపి బాటలోనే నడుస్తోంది. తాజాగా వర్మ వ్యాఖ్యలు కూటమి నేతల్లో చర్చ రేపాయి. బహిరంగ సమావేశాల్లో వర్మ ప్రశ్నలు కూటమి నేతలను కలవరపెడుతున్నాయని అంటున్నారు. పార్టీ పరంగా వర్మ కార్యకర్తలకు బలంగా ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో జనసేన-టిడిపి కలవడం ఇక్కడ కష్టతరంగా మారింది. గతం నుంచి ఇదే విధానం కొనసాగడం, రెండేళ్ల పాలన పూర్త?న కూటిమి నేతల్లో ఎటువంటి మార్పులు రాకపోవడంతో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ ప్రభావం ఉండే అవకాశాలున్నాయని కూటమి కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆత్మహత్య చేసుకున్న వింగ్ కమాండర్

**రాయ్ పూర్,** భారత వైమానిక దళంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక ఉన్నతాధికారి ఆత్మహత్య హాట్ టాపిక్ గా మారింది. ఛత్తీస్‌ఘడ్ రాయ్‌పూర్‌లో యాంటీ నక్సల్ ఆపరేషన్స్ విభాగంలో పనిచేస్తున్న వింగ్ కమాండర్ విపుల్ యాదవ్ తన అధికారిక నివాసంలో విగతజీవిగా కనిపించారు. విధి నిర్వహణలో ఎంతో ధైర్యవంతుడిగా పేరున్న అధికారి, ఇలా అర్థాంతరంగా తనువు చాలించడం తోటి అధికారులను, సిబ్బందిని తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. రాయ్‌పూర్‌లోని తేలీబంధా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమ్మెల్యే కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం విపుల్ యాదవ్ గది తలుపులు తీయకపోవడంతో, ఇంట్లో పనిచేసే వ్యక్తి కిటికీలోంచి చూడగా ఆయన ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ సమయంలో ఆయన భార్య బెంగళూరులో ఉండగా, ఇద్దరు పిల్లలు పక్క గదిలోనే నిద్రిస్తున్నట్లు సమాచారం. ఘటనా స్థలంలో ఎటువంటి ఆత్మహత్య లేఖ లభించలేదు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని అనుమానిస్తున్నారు. విపుల్ యాదవ్ భార్య గతంలో వైమానిక దళంలోనే పనిచేశారు, ప్రస్తుతం ఆమె బెంగళూరులోని ఒక ప్రముఖ ఐటీ కంపెనీలో టెక్కీగా పనిచేస్తున్నారు. 2014లో వీరిద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నప్పటికీ, గత కొంతకాలంగా వీరి మధ్య తీవ్రమైన మనస్పర్థలు ఉన్నాయని, తరచూ గొడవలు జరుగుతుండేవని రాయ్‌పూర్ పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తిగత సమస్యల వల్ల కలిగిన మానసిక ఒత్తిడే ఆయనను ఈ విపరీత నిర్ణయానికి ప్రేరేపించి ఉండవచ్చని ఏసీపీ రమాకాంత్ సాహు పేర్కొన్నారునక్సల్ వ్యతిరేక కార్యకలాపాల వంటి అత్యంత ఒత్తిడితో కూడిన విధుల్లో ఉంటూ, మరోవైపు కుటుంబ పరమైన ఇబ్బందులను ఎదుర్కోవడం ఆయనను కుంగదీసి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆయన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. సైనిక దళాల్లో అధికారుల మానసిక ఆరోగ్యం మరియు వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి సరైన వ్యవస్థలు అవసరమని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

# సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ

**న్యూఢిల్లీ,** లడఖ్‌కు స్వయంప్రతిపత్తి , రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్చుక్‌పై మోపిన జాతీయ భద్రతా చట్టం ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శనివారం ఉపసంహరించుకుంది. గతేడాది సెప్టెంబర్‌లో లేహ్‌లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారిన సమయంలో, ప్రజలను రెచ్చగొట్టారనే ఆరోపణలతో వాంగ్చుక్‌ను అరెస్టే చేసి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. దాదాపు ఆరు నెలల నిర్బంధం తర్వాత ఆయనపై జాతీయ భద్రతా చట్టంను ఉపసంహరించుకోవాలని నిర్ణయించారు. లడఖ్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడానికి, ఆ ప్రాంతంలోని స్టేక్‌హోల్డర్లతో అర్థవంతమైన చర్చలు జరపడానికి ఈ నిర్బంధాన్ని తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

గత కొంతకాలంగా లడఖ్‌లో నిరసనలు, బంద్‌ల వల్ల విద్యార్థులు, వ్యాపారులు, పర్యాటక రంగం తీవ్రంగా నష్టపోతున్నాయని, సాధారణ స్థితిని పునరుద్ధరించడమే తమ లక్ష్యమని హోం శాఖ స్పష్టం చేసింది. వాంగ్చుక్ ఇప్పటికే తన శిక్షా కాలంలో సగానికి పైగా పూర్తి చేశారని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆయనను విడుదల చేయడం సముచితమని ప్రభుత్వం భావించింది. వాంగ్చుక్ అరెస్టును సవాలు చేస్తూ ఆయన భార్య గీతాంజలి అంగ్మో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతకుముందు కోర్టులో వాదనలు వినిపిస్తూ, వాంగ్చుక్ యువతను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారని, నేపాల్, బంగ్లాదేశ్ తరహా ఆందోళనలకు పిలుపునిచ్చారని ప్రభుత్వం వాదించింది. అయితే, తాను ఎప్పుడూ హింసను ప్రేరేపించలేదని, హింస వల్ల లడఖ్ ఐదేళ్ల ప్రశాంతమైన పోరాటం వృథా అవుతుందని తాను గతంలోనే స్పష్టం చేశానని వాంగ్చుక్ తరఫు న్యాయవాదులు వాదించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ వంటి సంస్థలు స్వాగతించినప్పటికీ, లడఖ్ ప్రజల ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదని పేర్కొన్నాయి. రాష్ట్ర హోదా, ఆరో షెడ్యూల్ అమలు కోసం తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. వాంగ్చుక్ విడుదల తర్వాత లడఖ్ పరిపాలనలో, కేంద్ర ప్రభుత్వంతో జరిపే చర్చల్లో ఎలాంటి మార్పులు వస్తాయోనన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఇఫ్తార్‌కు రండి...

**హైదరాబాద్,** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో మార్చి 15వ తేదీన ఈ విందును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని కలిసి ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ స్పందిస్తూ, "గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఈ పవిత్ర రంజాన్ మాసంలో మార్చి 15న జరిగే ఇఫ్తార్ విందుకు ఆహ్వానించాను.

ఈ పవిత్ర సమయం అందరిలో శాంతి, కృతజ్ఞత, ఐక్యతను తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను," అని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. సూర్యాస్తమయం తర్వాత ఉపవాసాన్ని విరమించే ప్రక్రియనే ఇఫ్తార్ అంటారు. ఈ మాసంలో నాయకులు, ప్రముఖులు మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే మంత్రి అజారుద్దీన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

## అంజన్న గట్టుకు

# సంజయ్ పాదయాత్ర

**కరీంనగర్,** కేంద్ర మంత్రి బండి సంజయ్ తన మొక్కును తీర్చుకునేందుకు కరీంనగర్ నుండి కొండగట్టు వరకు 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరిట పాదయాత్రను చేపట్టారు. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటే నూతన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టుకు కాలినడకన వస్తానని ఆయన గతంలో ప్రకటించారు. ఆ మాట ప్రకారం, కరీంనగర్ మేయర్ పీఠం దక్కడంతో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బండి సంజయ్ ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో ఆయన వెంట కరీంనగర్ నూతన మేయర్, కార్పొరేటర్లు, సుమారు 10 వేల మంది కార్యకర్తలు పాల్గొని అంజన్న నామస్మరణతో ముందుకు సాగుతున్నారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. కరీంనగర్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులందరినీ ఏకం చేస్తూ, విజయానికి కృతజ్ఞతగా ఈ మొక్కును చెల్లించుకుంటున్నారు.

# దొంగకు దేహ శుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

**మహబూబాబాద్** మరిపెడ పట్టణంలోని కూరగాయల మార్కెట్లో దొంగ ఓ వ్యక్తి వద్ద నుంచి మొబైల్తో పాటు నగదును దొంగిలించే ప్రయత్నం చశాడు. స్థానికులు గమనించి దొంగను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. పోలీసులు దొంగను పోలీస్ స్టేషన్కు తరలించి, ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు..

# చందనోత్సవం ఏర్పాట్లపై మంత్రి అనిత సమీక్ష

**విశాఖపట్నం** సింహాచలం అప్పన్న స్వామిని హోం మంత్రి అనిత దర్శించుకున్నారు. మంత్రి అనితకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ మంత్రికి అర్చకులు వేద ఆశీర్వచనం చేసారు. .స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను హోం మంత్రికి అందజేసారు. చందనోత్సవం, స్వామివారి కల్యాణోత్సవం నేపథ్యంలో అధికారులు, అర్చకులతో ఏర్పాట్లపై మంత్రి చర్చించారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ గత సంవత్సరం చందనోత్సవానికి 1,20,000 మంది భక్తులు స్వామివారి దర్శనానికి రావడం జరిగింది. ఈ సంవత్సరం భక్తులు సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈనెల ఆఖరిలో మంత్రుల బృందం చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్షించనున్నాం. సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్యాస్ సంక్షోభం లేకుండా ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం చంద్రబాబు ఖీఉా నుండి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.. సీఎం చంద్రబాబు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. దయచేసి వదంతులను నమ్మొద్దు. సామాజిక మాధ్యమాల వేదికగా కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

## చాపాడు పరిధిలోని ఖాదరపల్లి గ్రామంలో

# కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- రికార్డులు లేని 16 వాహనాలు స్వాధీనం
- 14 సస్పెక్ట్ షీటర్లు, రెడ్ శాండల్ స్మగ్లర్లుకు కౌన్సిలింగ్
- అనుమానితులు, పాత నేరస్థుల ఇళ్లలో తనిఖీలు...
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసుల హెచ్చరిక



**కడప** శనివారం తెల్లవారుఝామున జిల్లాలోని మైదుకూరు సబ్ డివిజన్ చాపాడు పరిధిలోని ఖాదరపల్లి గ్రామంలో " ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా మైదుకూరు డి.ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఖాదరపల్లి గ్రామంలో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత నేరస్తులు మరియు అనుమానితుల ఇళ్లలో, అనుమానిత ప్రాంతాల్లో వేటకొడవళ్లు, బాంబులు



మరియు నిషేధిత ఆయుధాల కొరకు అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. తనిఖీ ల్లో రికార్డులు లేని 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు ఇస్తున్నారని రికార్డులు లేని వాహనాలు కొనుగోలు చేయ వద్దని, కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు సూచించారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు, రెడ్ శాండల్ స్మగ్లర్లకు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థులు ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడకుండా మీరు మీ పనులు చేసుకుంటూ ఆర్థికంగా ఎదిగి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై, ఉమెన్ సేఫ్టీ గురించి మైదుకూరు డి.ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి లేదా అనుమానితుల సమాచారాన్ని డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారమివ్వాలని మైదుకూరు డి.ఎస్పీ శ్రీరాజేంద్ర ప్రసాద్ సూచించారు. కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ లో మై మైదుకూరు రూరల్ సి.ఐ శివ శంకర్, ఖాజీపేట సి.ఐ వంశీధర్, బద్వేల్ సి.ఐ క్రిష్నయ్య మరియు ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఛార్మినార్ ప్రాంతంలో

# బూజు పట్టిన డ్రై ఫ్రూట్స్ స్వాధీనం



**హైదరాబాద్** హైదరాబాద్‌లోని ఛార్మినార్ ప్రాంతంలో బూజు పట్టిన డ్రై ఫ్రూట్స్‌ను నిల్వ ఉంచిన గోడౌన్‌పై బహదూర్‌పురా పోలీసులు దాడి చేసి భారీగా స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రతకు విరుద్ధంగా నిల్వ ఉంచిన ఈ ఫంగస్ పట్టిన డ్రై ఫ్రూట్స్ ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నాసిరకం మరియు బూజు పట్టిన ఆహార పదార్థాలను మార్కెట్‌లో విక్రయించడం వల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉంది.. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఇటువంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఏపీకి రూ.341 కోట్ల కేంద్రసాయం

జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి(ఎన్డీఆర్ఎఫ్) నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.341.48 కోట్ల సాయం ప్రకటించింది. గతేడాది సంభవించిన వరదలు, ఆకస్మిక వర్షాలు, మొంథా తుపాను, కొండచరియలు విరిగిపడటం కారణంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ లకు కలిపి మొత్తం రూ.1,912.99 కోట్ల సాయం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్షా అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయించింది. అందులో ఆంధ్రప్రదేశ్ కు రూ.341.48 కోట్లు (17.85%) కేటాయించింది.

## శ్రీవారి ఆలయంలో మార్చి నెలలో

# మూడు ఆస్థానాలు

**తిరుమల,** తెలుగు ఉగాది, శ్రీరామనవమి ముఖ్య పండుగలను పురస్కరించుకుని ఈ మార్చి నెలలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మూడు ఆస్థానాలు నిర్వహించనున్నారు. ఆస్థానం అనేది ఆలయంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆలయ దర్బారు. ప్రత్యేక పర్వదినాలలో గరుడాళ్వార్ సన్నిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది ఆస్థానంమార్చి 19న శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా మూలవిరాట్ మరియు ఉత్సవమూర్తులకు కొత్త వస్త్రాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారి సన్నిధిలో కొత్త సంవత్సరానికి సంబంధించిన పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు జరుగుతుంది. శ్రీరామనవమి ఆస్థానంమార్చి 27వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా గరుడాళ్వార్ సన్నిధిలో రాత్రి 9 గంటల నుండి 10 గంటల వరకు ఆస్థానం నిర్వహిస్తారు. దీనికి ముందు సాయంత్రం 6.30 నుండి 8 గంటల వరకు హనుమంత వాహన సేవ నిర్వహించబడుతుంది. ఆస్థానం సందర్భంగా వేదపండితులు శ్రీమద్రామాయణంలోని శ్రీరామ జనన ఘట్టాన్ని స్వామివారి సన్నిధిలో పఠిస్తారు. పట్టాభిషేక ఆస్థానంశ్రీరామనవమి తరువాతి రోజు రాత్రి 8 గంటల నుండి 9 గంటల వరకు తిరుమల ఆలయంలో పట్టాభిషేక ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీమద్రామాయణంలోని శ్రీరామచంద్రుని పట్టాభిషేక ఘట్టాన్ని స్వామివారి సన్నిధిలో పఠిస్తారు.

# నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిద్దాం


- 16న డి సి ఎల్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేద్దాం
- ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయపనేని హరికృష్ణ పిలుపు




**తిరుపతి** కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను కుట్రపూరితంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి తీసుకురానిందని దీనిని ప్రతి కార్మికుడు వ్యతిరేకించాలని ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి నారాయణపురం లోని ఐఎఫ్టియు కార్యాలయంలో ఐఎఫ్టియు నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు ఆ తరువాత అనేక ప్రజా ఉద్యమాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం తుడిచిపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 1926 ట్రేడ్ యూనియన్ చట్టానికి సవరణలు ప్రతిపాదించి కార్మికుల ప్రాథమిక హక్కు అయినా సమ్మె హక్కును పూర్తిగా దెబ్బతీయడానికి కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. మేడే పోరాటం ద్వారా సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలుగా మార్చి వేస్తున్నారని, వేతనాన్ని లెక్కించే పద్ధతిని వర్తింపజేసే పద్ధతిని దెబ్బతీయడం ద్వారా, వేతనాలు పెరుగుతున్న ధరలకు అలాగే జీవన వ్యయానికి విరుద్ధంగా కనిష్ట స్థాయికి కుదించాలని చూస్తున్నారన్నారు. పని స్థలాల్లో భద్రతను, రక్షణను యాజమాన్యాల సెల్ఫ్ సర్టిఫికెట్లకు పరిమితం చేస్తున్నారని మండిపడ్డారు. కోట్లాదిమంది కార్మికులు నిర్మాణ రంగంలో పని చేస్తుంటే వారి సంక్షేమ బోర్డుకం నిధులను సమీకరించే సెస్సు వసూళ్లను తగ్గిస్తున్నారన్నారు. అత్యంత ప్రమాదకర పరిస్థితులలో పనిచేసే కార్మికులకు చట్టపరమైన రక్షణలను కేంద్రం తెస్తున్న నాలుగు లేబర్ కోడ్లు హరించి వేస్తాయన్నారు. ఆటో మోటార్ కార్మికులు, హమాలీ ఇతర అనేక రంగాల్లో పనిచేసే కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయడానికి కూడా ఈ లేబర్ కోడ్లు పట్టించుకోలేదన్నారు. అంగన్వాడి, ఆశా , మధ్యాహ్నం భోజన, సర్వ శిక్ష అభియాన్, కస్తూరిబా ఇతర స్కీం వర్కర్లలో బండ చాకిరి చేసే కార్మికుల హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలనే డిమాండ్ ఈ కోడ్లు ద్వారా అమలు కాని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు కాబోతున్న నాలుగు లేబర్ కోడ్లును అడ్డుకోవడానికి కార్మిక వర్గం సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 23న ఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే మహా ప్రదర్శన, సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈనెల 23న ఛలో విజయవాడ గోడ పత్రిక లను ఆవిష్కరించారు. ఐఎఫ్టీయు జిల్లా కోశాధికారి కుడుం విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఎఫ్టీయు జిల్లా అధ్యక్షురాలు జి.భారతి, అంగన్వాడి కార్యదర్శి నాగరత్న, అధ్యక్షురాలు సుజాత, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాణి, అధ్యక్షురాలు లక్ష్మీ కళ, శాంతి, కవిత, చంద్రగిరి రేఖ, ఏపి ప్రగతిశీల హాకర్స్ యూనియన్ అధ్యక్షుడు దిలీప్, ఐఎఫ్టీయు నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాజశ్యామల ఆలయ ఉత్సవాలకు రండి

- హరీష్ రావుకు ఆహ్వానం



**హైదరాబాద్** కోకాపేట నియోపోలిస్ లోని శ్రీ రాజశ్యామల దేవస్థానంలో ఈ నెల 19న జరగనున్న ప్రభవ నామ సంవత్సర ఉగాది ఆస్థానం, అలాగే 27న జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాల్సిందిగా మాజీ మంత్రి హరీష్ రావును విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి కోరారు. హరీష్ రావు మాట్లాడుతూ శ్రీ రాజశ్యామల అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రార్థించడం జరిగిందని అన్నారు.

# మునిసిపల్ అధికారులపై వర్మ మండిపాటు


పిఠాపురం పిఠాపురం మున్సిపల్ అధికారులపై టీడీపీ ఇన్చార్జ్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేసారు. పారిశుద్ధ కార్మికుల శిక్షణ కార్యక్రమం మధ్యలో నుండి అలిగి వెళ్ళిపోయారు. వేదికపై ఉన్న ఫెక్సీ లో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఫోటో పెద్దదిగా, సీఎం చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండడంపై న టీడీపీ నేతలు మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్ తీరుపై వర్మ అసహనం వ్యక్తం చేసారు. చంద్రబాబుకు గౌరవం లేనప్పుడు.. మేమేందుకు ఇక్కడ అంటూ సమావేశం నుండి తన అనుచరులతో వాకౌట్ చేసారు.

## బొజ్జల సుధీర్ రెడ్డి నూతన గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి....



**రేణిగుంట మార్చి 14.** శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే, ఆప్తమిత్రులు బొజ్జల సుధీర్ రెడ్డి నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రత్యేకంగా విచ్చేసి బొజ్జల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కూటమి ముఖ్య నాయకులు,మరియు బొజ్జల కుటుంబ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు, విచ్చేసిన అతిథులందరికీ సుధీర్ రెడ్డి ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు.

## ఎమ్మెల్యే బండ్ల కుమారుడి వివాహానికి హాజరయిన సీఎం రేవంత్



**గద్వాల** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జోగులాంబ గద్వాల జిల్లా గద్వాలలో శనివారం జరిగిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుమారుడు సాయి సాకేత్ రెడ్డి ? ఐశ్వర్యల వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

### భారీ ఎత్తున ఉద్యోగాల కోతకు

## సిద్ధమైన మెటా

ప్రపంచ దిగ్గజ టెక్నాలజీ సంస్థ మెటా భారీ స్థాయిలో ఉద్యోగాల కోతకు సిద్ధమైంది.దాదాపు 16 వేల మంది ఉద్యోగులను తొలగించే యోచనలో సంస్థ ఉన్నట్లు సమాచారం.కంపెనీ మొత్తం సిబ్బందిలో సుమారు 20 శాతం మందిపై ప్రభావం పడే అవకాశం ఉంది.ఏఐ (కృత్రిమ మేధస్సు) వేగంగా విస్తరిస్తుండటంతో టెక్ రంగంలో ఉద్యోగాల నిర్మాణం మారుతోంది.ఖర్చులు తగ్గించడం, ఏఐ ఆధారిత వ్యవస్థలను పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### పిడుగురాళ్లలో జనసేన పార్టీ

## ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- దూదేకుల ఖాసీం సైదా టీం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ**



**పిడుగురాళ్ల** జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన జిల్లా జాయింట్ సెక్రెటరీ దూదేకుల ఖాసీం సైదా టీం ఆధ్వర్యంలో శనివారం పిడుగురాళ్ల పట్టణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన గురజాల నియోజకవర్గం సమన్వయకర్త కటికం అంకారావు చేతులమీదగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జనసేన నేతలు మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించి, ఓటమిని సైతం పట్టుదలగా మార్చి ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎన్నో పోరాటాలు చేస్తూ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో తనదైన శైలితో పరిపాలన అందిస్తున్నారని, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేస్తూ, వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహా నాయకుడు పవన్ కళ్యాణ్ అని, తన సొంత సొమ్మును పార్టీ కోసం, రాష్ట్ర ప్రజల కోసం ఖర్చు పెడుతూ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ సూచన మేరకు అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టామని అన్నారు, రాబోయే రోజుల్లో పార్టీ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి జనసేన పార్టీ మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దూదేకుల సలీం, దాచేపల్లి మండల అధ్యక్షులు పాముల కిషోర్, గురజాల మండల అధ్యక్షులు ఉప్పిడి నరసింహారావు, పిడుగురాళ్ల మండల కార్యదర్శి మందా జెస్సి, షేక్ గఫూర్, దూదేకుల ఖాసీం, వీరమహిళలు సింగంశెట్టి వెంకట రమణ, కొత్త అరుణ, షేక్ ఇస్మాయిల్,సంపత్, సిద్దెల సతీష్, నకరికంటి నర్సి, వెంకటాద్రి, పెద కొలిమి కిరణ్ కుమార్, బూర్స్ వీరయ్య, గుంజి నాగుల్ మీరా, రామదాసు, చింతకాయల కళ్యాణ్, గురసాలా ప్రసాద్, బీమా వెంకటేష్, భవిరిశెట్టి శ్రీనివాసరావు, సైదావలి, కోలా చరణ్, సయ్యద్ ఖాసీం, బాషా తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గుంత వారి వివాహ వేడుకలు

**- హాజరైన పలువురు రాజకీయ నాయకులు**




**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని గల చిన్న జొన్నగిరి గ్రామంలో వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుంత దేవి,మాజీ విద్యా కమిటీ చైర్మన్ గుంత రాఘవేంద్ర దంపతుల కుమార్తె ప్రియాంక పెళ్లి వేడుకలు అంగరంగ వైభవంగా శనివారం రోజున జరిగాయి. ఈ వివాహ వేడుకలకు పలువురు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ వేడుకలకు హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులను గుంత బ్రదర్స్ ఆంజనేయులు,రాఘవేంద్ర లు శాలువాలను వేసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,ఎమ్మెల్సీ మధుసూదన్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ విజయ మనోహరి,కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి,నాగరత్నమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి తిప్పయ్య స్వామి,మాజీ గ్రంథాలయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్,ఏడిసిసి మాజీ చైర్మన్ వీర,మాజీ జెడ్పిటిసి జగన్నాథ్ రెడ్డి,ఎంపీపీ గౌరవ సలహాదారుడు హనుమంతు,జడ్పిటిసి పులికొండ నాయక్,మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్ప, ఉప్పర్లపల్లి సొసైటీ చైర్మన్ అప్పా వేణు రాయల్,మారెళ్ళ సొసైటీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,కారం భాస్కర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,శ్రీరంగడు, రాఘవరెడ్డి,బాలన్న,విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి,పెరవలి సర్పంచ్ మల్లికార్జున,రాంపురం గంగాధర్, గోవిందరాజులు,నీలా మనోహర్,మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్, మనోహర్,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### వికలాంగుడికి అండగా నిలిచిన

## బీసీ ఇందిరా రెడ్డి

**- ప్రభుత్వ పింఛన్ మంజూరు అయ్యే వరకు ప్రతి నెల రూ.3,000 సొంత నిధుల నుండి అందజేస్తానని హామీ...**



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల గ్రామంలో నిర్వహించిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరుకావడానికి వెళ్తున్న సందర్భంగా, అదే గ్రామానికి చెందిన వికలాంగుడు తపాలా చౌడయ్య బీసీ ఇందిరా రెడ్డిని కలిసి తన సమస్యను వివరించారు. సంవత్సరం క్రితం జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఇంకా ప్రభుత్వం నుండి పింఛన్ మంజూరు కాలేదని ఆయన ఆమెకు తెలియజేశారు. చౌడయ్య పరిస్థితిని సానుభూతితో విన్న బీసీ ఇందిరా రెడ్డి, ప్రభుత్వం ద్వారా పింఛన్ మంజూరు అయ్యే వరకు తన సొంత నిధుల నుండి ప్రతి నెల రూ. 3,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. వికలాంగులు మరియు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలబడటం తన బాధ్యతగా భావిస్తున్నానని ఆమె తెలిపారు. అదేవిధంగా, సంబంధిత అధికారులతో మాట్లాడి చౌడయ్యకి ప్రభుత్వం నుండి పింఛన్ త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని కూడా ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆమె సేవాభావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, గూలి రామచంద్రారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, లోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### అంకాలమ్మ తల్లి తిరుణాలకు

## మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు ఆహ్వానం



**నంద్యాల** గోస్పాడు మండలం, సాంబవరం గ్రామంలో వెలసియున్న శ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవ ఆహ్వాన పత్రికను నంద్యాల మంత్రి గారి క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర మైనారిటీ మరియు న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారికి సాంబవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు శనివారం అందజేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామంలో శ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని. పండుగ రోజున ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన "ఎద్దుల బల ప్రదర్శన" (బండ లాగుడు పోటీలను) ప్రారంభించవలసిందిగా మంత్రి ఫరూక్ గారిని సాంబవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గోస్పాడు మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వర్ రెడ్డి , సాంబవరం గ్రామ మాజీ సర్పంచ్ జూపల్లి రామగోపాల్ రెడ్డి , టిడిపి నాయకులు జూపల్లి రామ భూపాల్ రెడ్డి ,జూపల్లి వెంకటరమణారెడ్డి , వాల్మీకి సంఘం సభ్యులు ఎస్ ఆదినారాయణ ,గోపవరం చంద్రుడు ,ఎం వెంకటయ్య చెన్నూరు నాగేంద్ర ,కొత్తపల్లి నాగలింగం ,కడియాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## జనసేన మరింత బలపడుతుంది

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి** జనసేన పార్టీ 13వ ఆవిర్భావ వేడుకలు ఎన్జీఓ కాలనీలోని తన కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. కాగా రుయా ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ లు సంయుక్తంగా పంపిణీ చేశారు. జనసేన పార్టీ భవిష్యత్ లో మరింత బలపడుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 12ఏళ్ళ జనసేన ప్రస్థానంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నాపార్టీ బలంగా నిలబడగలిగిందని ఆయన చెప్పారు. 150 మందితో ప్రారంభమైన జనసేన 13లక్షల మంది క్రియాశీలక సభ్యులను కలిగి ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమి క్రియాశీలక సభ్యత్వ నమోదుతో క్రియాశీలక సభ్యత్వం మరింత పెరుగుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్ళాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. డిప్యూటీ సిఎంగా పవన్ కళ్యాణ్ తన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎస్ కె బాబు, దూది కుమారి, శైలజ, సికె రేవతి, జనసేన పార్లమెంట్ పరిశీలకులు వెంకటేశ్వర రావు, నగర అధ్యక్షులు రాజా రెడ్డి, సుభాషిణి, కీర్తన, క్రికెట్ విజయ్, సికె రవి, తిరుత్తణి వేణుగోపాల్, ఆదం సుధాకర్ రెడ్డి, కెఎంకె లోకేష్, జెకె రాయల్, బాబ్జి, సుధాకర్, రాజేష్ ఆచ్చారి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, టౌన్ బ్యాంక్ డైరక్టర్లు అనీల్ రాయల్, వెంకటేష్, యువరాజ్ రెడ్డి, నీలాద్రి, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లూజ్ పెట్రోల్ అమ్మకాలపై నిషేధం

**న్యూఢిల్లీ,** ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పెట్రోల్, డీజిల్‌ను సీసాలు, డబ్బాలు వంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీ చేసింది. అదే సమయంలో, దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్సును తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో, దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడం వల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది.

### మరో 30 రోజుల

## వీసా పొడిగింపు

**న్యూఢిల్లీ,** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం విదేశీయులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయాలు తీసుకుంది. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా విమాన రాకపోకలకు అంతరాయం కలగడంతో భారత్‌లో చిక్కుకుపోయిన విదేశీయుల కోసం వీసా గడువు పెంపు, జరిమానాల మినహాయింపును ప్రకటించింది. దుబాయ్‌లోని భారత కాన్సులేట్ వెల్లడించిన వివరాల ప్రకారం, గడువు ముగిసిన లేదా త్వరలో ముగియనున్న వీసాలు, ఈ–వీసాలను ఉచితంగా ఒక నెల పాటు పొడిగించనున్నారు. ఫిబ్రవరి 28 తర్వాత యుద్ధం కారణంగా అనివార్యంగా భారత్‌లో ఉండిపోయిన విదేశీయులకు ఓవర్‌స్టే పెనాల్టీని కూడా పూర్తిగా మినహాయించారు. ప్రయాణ మార్గాలు పునరుద్ధరించిన తర్వాత వారు తిరిగి వెళ్ళడానికి అవసరమైన ఎగ్జిట్ పర్మిట్లను కూడా ఉచితంగానే జారీ చేయనున్నారు.

ఒకవేళ ఎవరైనా సాంకేతిక కారణాల వల్ల వీసా పొడిగింపునకు దరఖాస్తు చేయలేకపోయినా, దానిని నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబోమని అధికారులు స్పష్టం చేశారు. అలాగే, విమానాల దారి మళ్లింపు వల్ల భారత్‌లో దిగే విదేశీయులకు తాత్కాలిక ల్యాండింగ్ పర్మిట్లను కూడా ఉచితంగా మంజూరు చేయనున్నారుమరోవైపు, ఖతార్ ఎయిర్‌వేస్ ద్వారా సుమారు 500 మంది భారతీయులు సురక్షితంగా దోహా నుంచి కొచ్చి, ఇతర ప్రాంతాలకు చేరుకున్నారు. ఖతార్ గగనతలం పాక్షికంగానే తెరిచి ఉండటంతో విమాన సర్వీసులు పరిమితంగా నడుస్తున్నాయి.

### తెలుగు రాష్ట్రాల మధ్య

## విజయ రగడ

**హైదరాబాద్,** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తిగా ఉన్న విజయ డెయిరీ బ్రాండ్ వినియోగంపై ఇప్పుడు సరికొత్త వివాదం రేగింది. తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేష్‌కు సోషల్ మీడియాలో సుదీర్ఘమైన విజ్ఞప్తిచేశారు. ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ అనుసరిస్తున్న విధానాలు వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. తెలంగాణలో విజయ తెలంగాణ పేరుతో ప్రభుత్వం స్వయంగా రైతుల నుంచి పాలను సేకరించి, ప్రాసెసింగ్ చేసి విక్రయిస్తుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని అమిత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ంఖఆఆఅఈ వద్ద సొంతంగా పాల సేకరణ గానీ, చిల్లింగ్ సెంటర్లు గానీ, ప్రాసెసింగ్ యూనిట్లు గానీ లేవని ఆయన గుర్తు చేశారు. కేవలం విజయ అనే బ్రాండ్ పేరును ప్రైవేట్ వ్యక్తులకు ఫ్రాంచైజీ పద్ధతిలో కట్టబెట్టారని, ఆ ప్రైవేట్ ఆపరేటర్లు ఎక్కడో సేకరించిన పాలను విజయ బ్రాండ్ పేరుతో విక్రయిస్తూ వినియోగదారులను నమ్మిస్తున్నారని ఆయన లేఖలో ఆరోపించారు. కృష్ణా, కర్నూలు, నెల్లూరు వంటి జిల్లాల్లో మ్యాక్స్ చట్టం కింద నమోదైన జిల్లా యూనియన్లు తమ పరిధిని దాటి 'విజయ' బ్రాండ్‌ను వాడుతున్నాయని అమిత్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయా జిల్లాల పరిధులు దాటి ఈ బ్రాండ్‌ను మార్కెటింగ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ సంస్థలు విజయ బ్రాండ్ వాడుతూ ఏపీ డెయిరీ క్వాలిటీ ప్రొడక్ట్ అని ప్రచారం చేసుకోవడం వల్ల సామాన్య ప్రజలు అది ప్రభుత్వ ఉత్పత్తే అని మోసపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆశించిన "ఒకే దేశం – ఒకే మార్కెట్ స్ఫూర్తికి ఏపీ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రైవేట్ ఫ్రాంచైజీ ఒప్పందాలు విరుద్ధమని అమిత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వెంటనే ఈ ప్రైవేట్ ఒప్పందాలను రద్దు చేయాలని, అనధికారికంగా విజయ బ్రాండ్‌ను వాడుతున్న జిల్లా యూనియన్లపై చర్యలు తీసుకోవాలని నారా లోకేష్‌ను కోరారు. ఇలాంటి దిద్దుబాటు చర్యల వల్లనే సహకార రంగం బలోపేతం అవుతుందని, కల్తీ పాలను అరికట్టవచ్చని ఆయన సూచించారు. ఈ అంశంపై నేరుగా కలిసి వివరించేందుకు కూడా తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు.

## బాలీవుడ్‌లో కీర్తి సురేష్

# మరో భారీ ప్రాజెక్ట్..

### – రాజ్ కుమార్ రావుతో కలిసి సరికొత్త థ్రిల్లర్!



బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్' (=ఘట్ఘుతీ). ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనూరాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ం రాజకీయం

## తండ్రి పాలిటిక్స్, కొడుకు

# సినిమాకు బ్రేక్..

### 'సిగ్మా' విడుదలపై సందిగ్ధత.!



అరంగేట్రం ఇప్పుడు టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ సినిమాపై ఊహించని ప్రభావం చూపుతోంది. విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' (౧ఙఅస్త్రమ్ఘు). ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ షూటింగ్ ఇప్పటికే పూర్తయినప్పటికీ, విజయ్ తన రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (౧ఎఖ) పనుల్లో బిజీగా ఉండటం మరియు ఆయన వ్యక్తిగత జీవితం చుట్టూ ఉన్న తాజా పరిణామాల నేపథ్యంలో మేకర్స్ వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఈ సమయంలో సినిమాను విడుదల చేస్తే మీడియా నుండి ఎదురయ్యే రాజకీయ సంబంధిత ప్రశ్నలు జేసన్ సంజయ్‌ను ఇబ్బంది పెడతాయని, అది సినిమాపై ఉన్న శ్రద్ధను పక్కదారి పట్టిస్తుందని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ భావిస్తోంది. మొదట ఈ చిత్రాన్ని 2025 చివరలో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాతే థియేటర్లలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. ఎస్.ఎస్. తమన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా, తాజా రాజకీయ పరిణామాల వల్ల ఈ సినిమా విడుదల ఆలస్యం కావడం సందీప్ కిషన్ అభిమానులను కాస్త నిరాశకు గురిచేస్తోంది. విజయ్ రాజకీయ తుపాను తగ్గిన తర్వాతే జేసన్ సంజయ్ తన దర్శకత్వ ప్రతిభను వెండితెరపై ప్రదర్శించే అవకాశం కనిపిస్తోంది.

## అదే నిజమైతే

## టైమ్ మొదలైనట్టే



పన్నెండేళ్ల క్రితం 'ఊహలు గుసగుసలాడే' అనే హిట్ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఢిల్లీ భామ రాశీఖన్నా. ఆ తర్వాత ఎన్టీఆర్, రవితేజ, ధనుష్ వంటి స్టార్లతో సినిమాలు చేసినా, అనుకున్నంత స్టార్‌డమ్ మాత్రం రాశీఖన్నాను వరించలేదు. నిజానికి అందంలోనూ, అభినయ సామర్థ్యంలోనూ నేటి స్టార్ హీరోయిన్లెవరికీ తీసిపోదు రాశీఖన్నా. కానీ ఇండస్ట్రీలో ఎదగాలంటే గుమ్మడికాయంత విద్వత్తుంటే చాలదు, ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి. ఆ అదృష్టం కోసం దశాబ్దానికి పైగా ఎదురుచూస్తూనే ఉంది ఈ అందాలభామ. ఈ నెల 19న రానున్న పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' తన కెరీర్‌కి గేమ్‌ఛేంజర్ అని ఆమె గట్టిగా నమ్ముతోంది. ఇదిలావుంటే, ఈ క్రేజీ సినిమా తర్వాత, వెంటనే మరో పానిండియా సినిమాలో రాశీఖన్నా భాగం కానున్నట్టు తెలిసింది. అల్లు అర్జున్ హీరోగా తమిళ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ ఓ భారీ పాన్ ఇండియా మూవీకి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ మూవీలో కీలక పాత్ర కోసం రాశీఖన్నాను దర్శకుడు లోకేష్ కనకరాజ్ సంప్రదించారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. ఇదే నిజమైతే రాశీఖన్నా టైమ్ నిజంగా మొదలైనట్టే.



# అమ్మ చెక్కిన శిల్పాన్ని నేను

సృష్టిలో తొలి గురువు అమ్మ . పొత్తిళ్లలో బిడ్డకు అమ్మ చెప్పే కథలే జ్ఞానబోధలు. ఎదుగుతూ.. అమ్మని చదువుతూ.. మంచీచెడూ నేర్చుకుంటాం. సమస్త కళలూ అమ్మ పాలధార నుంచే ఉత్పన్నమవుతాయనేది ఆర్యోక్తి. నటి సాయిపల్లవి కూడా ఇదే విషయాన్ని అద్భుతంగా తన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'అమ్మ చేయి పట్టుకొని నడకే కాదు, నాట్యం కూడా నేర్చుకున్నాను. ఈరోజు మీరు చూస్తున్న సాయిపల్లవి అమ్మ చెక్కిన శిల్పం. మా అమ్మ పేరు రాధామణి. అద్భుతమైన నాట్యకళాకారిణి. నాట్యంలోని మెళకువలన్నీ అమ్మను చూసే నేర్చుకున్నాను. మా అమ్మ నాకు ప్రత్యేకంగా నేర్పింది కూడా ఏమీ లేదు. చూస్తూవుంటే, అలా వచ్చేసింది అంతే. ఒకరకంగా నాట్యం నాకు వారసత్వం ఇచ్చిన వరం.

నా నాట్యం వెనుక ఉండే ఎమోషన్ మా అమ్మ. నా కళ్లలో పలికే భావాలు, పరిణతితో కూడిన నాట్య ముద్రలు, భంగిమలు ఇవన్నీ అమ్మను చూస్తూ నేర్చుకున్నవే. నేను వెస్ట్రన్ వేసినా, ఫోక్ డ్యాన్స్ చేసినా అందులో తెలియని క్లాసిక్ టచ్ ఉంటుంది. దానికి కారణం కూడా మా అమ్మే. నన్ను డాక్టర్ చదివించినా, నాలోని డ్యాన్సర్‌ని మాత్రం అమ్మ నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉంది. అమ్మ అభిరుచిని గుర్తించే నేను నటిని అయ్యాను. అమ్మ సాధించలేనిది సాధించి, ఆ విజయాన్ని అమ్మకు కానుకగా ఇచ్చాను' అంటూ గర్వంగా చెప్పుకొచ్చింది సాయిపల్లవి.


## మరోమారు అనుష్క

# పెళ్లి వార్తలు



దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్న ప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

# 15న ఉస్తాద్ ప్రీరిలీజ్ వేడుకలు




పవన్‌కల్యాణ్ అభిమానులకు మరో శుభవార్త. పవన్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రీ-రిలీజ్‌వేడుక ఖరారైంది. మార్చి 15న హైదరాబాద్ పోలీస్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5గంటల నుంచి ఈవెంట్ మొదలవుతుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అలాగే దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఈసారి ఈవెంట్ బద్దలైపోవాలి ఫ్రెండ్స్' అని పేర్కొన్నారు. ఇక శనివారం సాయంత్రం 'ఉస్తాద్' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. రాశీఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత హరీశ్-పవన్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154